క్లుప్తంగా

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం సదాశివపురం గ్రామానికి చెందిన పి.మునిశంకర్ ఈనెల 9వ తేదీన నెల్లూరుకు వచ్చారు. పొదలకూరు రోడ్డు హెచ్ఆర్ కల్యాణ మండపం సమీపంలోని హోటల్ వద్ద తన యమహా క్రక్స్ బైక్‌ను నిలిపారు. హోటల్‌లో టిఫిన్ చేసి బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు గురువారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణ పనులు

- స్థానికులు అడ్డగించడంతో వెనుదిరిగిన వైనం

నెల్లూరు సిటీ: ప్రభుత్వ స్థలంలో ఓ వర్గం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రూరల్ నియోజకవర్గంలోని 30వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలో ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో ఓ వర్గం నిర్మాణాలు చేపట్టేందుకు గురువారం ఉదయం శంకుస్థాపన చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ ప్రభుత్వ స్థలంలో పార్కు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను మాత్రమే చేసేందుకు గతంలో మంత్రి నారాయణ హామీ ఇచ్చారని స్థానికులు తెలిపారు. ఎలాంటి కట్టడాలు చేసినా తాము ఒప్పుకోమన్నారు. దీంతో ఆ వర్గం అక్కడి నుంచి వెళ్లిపోయింది.

డాక్టర్ రవికుమార్ మృతి బాధాకరం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్యశాఖలో డాక్టర్‌గా సేవలందిస్తూ డాక్టర్ రవికుమార్(60) గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమని ఏపీ హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రవికుమార్ కోట, సీతారామపురం పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్‌గా పని చేశారన్నారు. ప్రస్తుతం గూడూరు ఏరియా హాస్పిటల్‌లో సేవలందిస్తూ గుండెపోటుకు గురయ్యారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

మెడికవర్‌లో వందేమాతరం హెల్త్ చెకప్

నెల్లూరు(అర్బన్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రూ.1,947లకే వందేమాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ పేరుతో పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆస్పత్రి క్లస్టర్ హెడ్ రంజిత్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్యాకేజీలో అతి తక్కువ ఖర్చుతో సమగ్ర పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఉచిత కన్సల్టేషన్‌తో పాటు కంప్లీట్ బ్లడ్ పిక్చర్, సీయూఈ, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్ లివర్ ఫంక్షన్ టెస్ట్, ఎక్స్‌రే చెస్ట్, ఈసీజీ, 2డీ ఎకో, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, హెచ్‌బీఏ1సీ, సీరం యూరియా, అల్ట్రా సౌండ్‌స్కానింగ్, సీరం క్రియాటినిన్, కార్డియాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, డైటీషియన్ సలహాలతో పాటు ఇంకా పలు రకాల పరీక్షలు చేస్తామన్నారు. ఈ ప్రత్యేక ప్యాకేజీ ఆఫర్ ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం 040 68334455 అనే నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

సమస్యలపై స్పందించకపోవడం బాధాకరం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 15వ తేదీ ఆత్మ త్యాగం చేస్తామని చెప్పినప్పటికీ రాష్ట్ర మంత్రి స్పందించకపోవడం బాధాకరమని అసంఘటిత కార్మిక, ఉద్యోగ సంఘం నాయకుడె సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరాభవన్‌లో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్టీసీలో రిటైర్ అయిన ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.వెయ్యి పింఛన్ అందుతోందని, అయితే తమకు వృద్ధాప్య పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఆత్మత్యాగం చేస్తానని చెప్పిన ప్రకటనను వాయిదా వేస్తున్నామన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

నెల్లూరురూరల్: జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు పనిచేయాలని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను గురువారం సాయంత్రం నిర్వహించా రు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీసీ హాలు నుంచి కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, జిల్లాలోని సాగునీటి సలహామండలి సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు హాజరయ్యారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు.

అమరవీరులను స్మరించుకోవాలి

నెల్లూరురూరల్: దేశ స్వాతంత్య్రం కోసం 3.50 లక్షల మంది ప్రాణత్యాగాలు చేశారని, అలాంటి అమరవీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని బీజేపీ నేతలు కందికట్ల రాజేశ్వరి, మిడతల రమేష్ అన్నారు. స్మృతి దినోత్సవాన్ని బీజేపీ నేతలు గురువారం మూలాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్య్ర ప్రకటన చేసే ముందు రోజు భారతదేశాన్ని రెండుగా విభజించారని, ఆ విభజన గాయాల బాధలను భారతీయులు నేటికీ అనుభవిస్తున్నారన్నారు.

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ కార్తీక్

- ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం
- విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతున్న కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు

నెల్లూరురూరల్: 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అద్దం పడుతూ శకటాలను ప్రదర్శించనున్నారు. విశిష్ట సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి మంత్రి నారాయణ చేతుల మీదుగా పురస్కారాలు అందించనున్నారు. వీఐపీలు, అవార్డు గ్రహీతలు, మీడియా, విద్యార్థులు కూర్చునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా నగరంలోని కలెక్టరేట్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు జేసీ కార్తీక్ పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.



విద్యుద్దీప కాంతుల్లో మహాత్ముని విగ్రహం

రోడ్డు ఆక్రమణలు తొలగించండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ చేపట్టిన కట్టడాలను గుర్తించి, సంబంధిత నోటీసులను జారీ చేసి తొలగించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. స్థానిక మద్రాసు బస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ఆచారివీధి పరిసర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆచారివీధి రోడ్డును ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలను గమనించి, చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు మార్జిన్‌కు మార్కింగ్ చేయాలని సూచించారు. అనంతరం స్థానిక అయ్యప్పగుడి కల్లూరుపల్లి రోడ్డులో జరుగుతున్న నూతన రోడ్డు నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. అదేవిధంగా రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎమ్మెస్ ఫ్రూట్ షాపు రోడ్డు మార్జిన్ను దాటి విక్రయాలు జరుగుతుండటం గమనించి రూ.పది వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఆచారివీధిలో రోడ్డు ఆక్రమణలను గుర్తించి యజమానులను హెచ్చరిస్తున్న కమిషనర్

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

నెల్లూరు(పొగతోట): సర్వీస్ హోమ్‌లో ఉంటున్న బాలికలు, మహిళలకు నాణ్యమైన భోజనం, తాగునీరు ఇతర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని సర్వీస్ హోమ్‌ను ఆమె గురువారం పరిశీలించారు. బియ్యం, కూరగాయలు, సరుకులు, తాగునీటి ప్రమాణాలను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ హోమ్‌లో ఉంటున్న బాలికలు, మహిళలకు నాణ్యమైన భోజనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నాణ్యత విషయంలో లోటుపాట్లు జరిగితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణాధికారి టి.అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

నెల్లూరు(అర్బన్): వర్షాలు పడుతున్న నేపథ్యంలో జిల్లాలో డెంగీ, చికెన్‌గన్యా, మలేరియా లాంటి జబ్బులను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించి, మాట్లాడారు. మలేరియా, డెంగీ లాంటి జబ్బులు నమోదైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఆయా ప్రాంతాల్లో కీటకజనిత వ్యాధుల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయాలన్నారు. నీటి గుంతల్లో దోమల లార్వాలు తినే గంబూసియా చేపలను వదలాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సెక్రటరీల సాయంతో వాటర్ ట్యాంకులను క్లీనింగ్ చేయించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

సీపీఎం నేతల నిరసన

నెల్లూరు సిటీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సీపీఎం జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరులు ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఎస్ఐఆర్‌లో ఉన్నాయన్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిరాకరించడమే అని తెలిపారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రహంతు జానీ, శేషగిరిరావు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇంజినీరింగ్ విభాగం, హౌసింగ్, టిడ్కో అధికారులు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో వారాంతపు సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పన్ను పరిధిలోకి రాకుండా అక్రమంగా వాడుతున్న కుళాయిలను గుర్తించి పన్నులు నమోదు చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో అనధికార కుళాయి కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించడంలో అమెనిటీస్ కార్యదర్శులు బాధ్యత వహించాలని తెలిపారు. మొండి బకాయిదారులకు కోర్టుల ద్వారా సమన్లు జారీ చేసి నేషనల్ లోక్ అదాలత్ ద్వారా అపరాధ రుసుములు వసూలు చేసేలా చార్జ్‌షీట్ల దాఖలకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం డీఈఈలు ముజాహిద్దీన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



నెల్లూరు (టౌన్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల, జనహిత వాత్సల్య, విద్యా వికాస్ స్కూల్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని గురువారం నిర్వహించారు. బీవీనగర్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల నుంచి వనంతోపు సెంటరు మీదుగా తిరిగి కళాశాల వద్ద వరకు ర్యాలీ జరిగింది. విద్యార్థులు వంద మీటర్ల జాతీయ పతకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, స్కూల్ హెచ్ఎం మల్లికార్జునరావు, ఎస్ఎస్ఎస్ పీఈటీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ



నెల్లూరు (టౌన్): స్థానిక సుబేదారుపేటలోని సెయింట్ జోన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పూర్వ విద్యార్థులు ఎస్‌జేఓఎస్ఏ విద్యానిధి స్కాలర్‌షిప్‌లో భాగంగా ఆ స్కూల్‌లో చదువుతున్న 34 మంది మెరిట్ విద్యార్థులకు రూ.1,26,947లు గురువారం పంపిణీ చేశారు. ఈ క్రమంలో పూర్వ విద్యార్థులు సుంకు సత్యసాయిప్రకాష్ రూ.65 వేలు, అజీజ్ అహ్మద్ రూ.40 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ జోన్స్ ఓల్డ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీ లయన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుగాళమ్మ సన్నిధిలో విశేష పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నేడు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ గిరికృష్ణ గురువారం తెలిపారు. ఈ క్రమంలో మూలవర్లకు ఉదయం 6.30 గంటలకు అభిషేకం, 8 గంటలకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండా వందనం, సాయంత్రం 4.30 గంటలకు హోమం, 6.30కి పుష్పయాగం ఉంటుందన్నారు. అదేవిధంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఎమ్మెల్సీ ఆశీర్వాదం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని వెంకటేశ్వరపురంలో 53వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా శరత్‌కుమార్‌రెడ్డి వివాహ వేడుకకు పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.